జోరు వానలు.. హోరు వాగులు



కప్పల వాగు వద్ద వాగు దాటుతున్న ఆర్టీసీ బస్సు



పోతినవారిపాలెం సమీపంలో చెరువులను తలపిస్తున్న పొలాలు



వర్షం ధాటికి దెబ్బతిన్న మార్టూరు-బల్లికురవ రోడ్డు



పంగులూరులో నీటమునిగిన మినుము, మిర్చి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన వర్షం సోమవారం అంతా ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో రోడ్లపై వర్షపు నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చినగంజాం, ఇంకొల్లు మండలాల్లో పలు వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

\- సాక్షి నెట్‌వర్క్



ఉడ్‌నగర్‌లో రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మ



మార్టూరు-గన్నవరం రోడ్డు ఇలా..



చీరాల దర్బార్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



పంగులూరు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు



పోలూరులో పొంగి పొర్లుతున్న వాగును పరిశీలిస్తున్న ఎస్సై రత్నకుమారి



తిమిడెదపాడు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



చెరువులా మారిన ఈపురుపాలెం-బాపట్ల ప్రధాన రహదారి



కేశవరప్పాడు వద్ద పొంగిపొర్లిన వాగును దాటుతున్న ప్రజలు

సంక్షిప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కారంచేడు: మండల పరిషత్ సమావేశంను మంగళ వారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశానికి మండలం లోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. మండల పరిధిలోని 18 శాఖల అధికారులకు సమాచారం అందించామని, హాజరయ్యే అధికారులు పూర్తి సమాచారంతో రావాలని ఆయన కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామాంజనేయులు

వేటపాలెం: రామన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో కృతి ఫౌండేషన్ సౌజన్యంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వర్షం కురుస్తున్నప్పటికీ బీపీ, షుగర్, కిడ్నీ, ఈసీజీతో వివిధ రకాల వైద్యపరీక్షలు 150 మందికి ఉచితంగా నిర్వహించారు. వీరిలో 30 మందికి మెరుగైన వైద్య పరీక్షలకు సిఫార్సు చేశారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. క్యాంపులో డాక్టర్ రామాంజనీయులు, ఆప్తాలమిస్ట్ లత, కిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నేత నాగేంద్రరావు

మేదరమెట్ల: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లను వెంటనే పునరుద్ధరించి వాటికి సంబంధించిన రిలీఫ్ ఫండ్స్‌ను విడుదల చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఎస్సీ,ఎస్టీ, బీసీలను చంద్రబాబు ప్రభుత్వం మరచిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క పింఛన్ల పంపిణీ తప్ప మరే హామీని నెరవేర్చలేదని, ఎస్సీ ఎస్టీలకు ఉపయోగపడే కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రంలో రిలీఫ్ ఫండ్ రూ.50 కోట్లు ఎస్సీ, ఎస్టీలకు బకాయిలు ఉన్నాయన్నారు. చెగువీర, కార్ల్‌మార్క్స్, అంబేద్కర్ తనకు ఆదర్శం అని చెప్పిన జనసేన ప్రస్తుతం బీజేపీ భజనసేనగా మారిందని విమర్శించారు. ఎస్సీ ఎస్టీలు ఓట్లు వేసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను గెలిపిస్తే అధికారం వచ్చాక తమను మరచిపోయారని నాగేంద్ర విమర్శించారు. ఆయన వెంట మాలమహానాడు అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, శ్రీనివాసరావు, మక్కెన వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులకు జరిమానా

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండ చెరువు చుట్టూ గల చేపల చెరువులకు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు ఆదేశాలతో ఏఈ శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి రూ. 1.75 లక్షలు అపరాధ రుసుము వేసినట్లు అద్దంకి రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. తనిఖీలో రూరల్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటక కళాకారుడు మృతి



మస్తాన్ వలి

ఇంకొల్లు(చినగంజాం): ప్రముఖ నాటక కళాకారుడు షేక్ మహబూబ్ మస్తాన్‌వలి (65) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇంకొల్లు గ్రామానికి చెందిన ఆయన నాటక కళాకారుడుగానే కాకుండా ఆర్టీసీ సంస్థలో డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. దుర్యోధనుడు, రావణ బ్రహ్మ వంటి పాత్రలు పోషించి అందరి మెప్పును పొందారు. మస్తాన్‌వలి మృతి పట్ల బాపట్ల ఇన్‌చార్జ్ సీటీఎం రవికాంత్, చీరాల ఆర్టీసీ డీఎం జంజనం శ్యామలలు సంతాపం ప్రకటించగా, సీనియర్ కళాకారులు నార్నేశివాజీ, గట్టుపల్లి సుబ్బారావు, ప్రేమ్‌కుమార్, ఆశీర్వాదం, ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణశాస్త్రిలు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

రూ.250 కోర్టు స్టాంపులు ఆవిష్కరణ

చీరాల రూరల్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతనంగా ప్రవేశపెట్టిన రూ.250 కోర్టు స్టాంపులను సోమవారం బార్ అసోసియేషన్ హాలులో అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. న్యాయవాదులందరూ స్టాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బోయిన శ్రీనివాసరావు, ట్రెజరర్ నాశిన రాము, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

అద్దంకి రూరల్: స్థానిక భవిత కేంద్రంలో 10 వతరగతి చదువుతున్న వినికిడి లోపం గల విద్యార్థిని కోవూరి దుర్గా తండ్రి అకాల మరణం చెందారు. ఆ కుటుంబానికి ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని నిత్యావసరాలు, పండ్లు, కూరగాయాలు, రూ. 2 వేల నగదు అందజేశారు. కుటుంబానికి సహాయాన్ని అందించినందుకు ఎంఈవో 1,2లు డీ.గంగాధరరావు, బీ. సుధాకరరావు ప్రియదర్శినిని అభినందించారు